# జాషువా సాహిత్యం -దేశభక్తి

తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం గల కవి దిగ్గజం జాషువా. ఈయన 1895 సెప్టెంబర్ 28 న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. ప్రాథమిక ఉపాధ్యాయుడిగా, వారిలో తెలుగు ప్రొఫెసర్ గా వివిధ ఉద్యోగాలు చేశారు. ఈ కవి ఫిరదౌసి, గబ్బిలం, ముంతాజ్ మహల్, స్వప్న కథ, అనాథ, ముషాయిరాలు, కొత్త లోకం, నేతాజీ , బాపూజీ మొదలైన రచనలు చేశారు. జాషువాకు కవికోకిల, మధుర శ్రీనాథ ,నవయుగ కవి చక్రవర్తి మొదలైన బిరుదులున్నాయి. ప్రాచీన కవులు శ్రీనాథుడు, అల్లసాని పెద్దన వంటి కవులు పొందిన కనకాభిషేకం, గండపెండేర సత్కారం మొదలైన సత్కారాలు జాషువాకు కూడా జరిగాయి. ఇవన్నీ ఈయనకున్న ప్రతిభకు తార్కాణాలుగా నిలుస్తున్నాయి. ఈయన 1971 సంవత్సరం జూలై 24న పరమపదించారు.

గుర్రం జాషువా పేరు వినగానే చాలామందికి దళిత వేదననూ, అస్పృశ్యత పట్ల నిరసనను బలంగా వినిపించిన కవిగా ముందు గుర్తుకొస్తారు. కానీ, జాషువా రచనలు పరిశీలించినట్లయితే ఈయనకు దేశం పట్ల గల భక్తి గౌరవాలు తెలుస్తాయి. జాషువా గారి భరతమాత ఖండికలోని పద్యాలను చూస్తే ఈ విషయం స్పష్టమౌతుంది. ఈ ఖండికలోని పద్యాన్ని చూద్దాం.

సీ. *ప్రమథ నాథుని నీరు ద్రావింపజాలిన*
*వజ్రాల కొడుకుల బడసినావు*
*నరకాధిపతిగుండె గరగింపజాలిన*
*వెలదిమిన్నల కగుబెట్టినావు*
*బ్రహ్మయంతటివాని వణకింపజాలిన*
*మునుల మూపున నిడి మోసినావు*
*అంటినంతన పాప మడగింపజాలిన*
*తీర్థకోటుల మురి తేలినావు*

తే.గీ. *“ఉర్వి పుట్టకముందె నీవుంటివేమొ*
*సకలశాస్త్ర పురాణముల్చదివినావు*
*గొనబు సిరిగల భాగ్య శాలినివి నీవు*
*భారతాంబామణీ నమస్కారమమ్మ”*
(జాషువా సర్వ లభ్య రచనలు, పుట: 539)

దేవతల ప్రార్థనతో గజాసురుని పొట్ట నుండి శివుడు బయటికి వచ్చి ప్రమథగణాలతో కైలాసానికి వస్తాడు. లోపలికి వెళ్ళకుండా అడ్డగిస్తాడు. తాను తనకు పని అప్పగించిన పార్వతి దేవి భర్తనని చెప్పినా సరే వినకుండా నడిపిస్తాడు వినాయకుడు. అదేవిధంగా గణాధిపతిని నిర్ణయించే సందర్భంలో శివుడిని ఆక్షేపిస్తాడు. కుమార స్వామి ఈ విధంగా తమ కర్తవ్య నిర్వహణలో స్వ పర భేదాలకు చోటు లేకుండా స్థిరంగా నిలబడిన వారు వినాయకుడు, కుమార స్వామి వీరితో భరతమాత సంతతిని పోల్చడం వలన భరతమాత బిడ్డలందరూ కర్తవ్య పరాయణులని కీర్తించాడు. కవి.

మరో పాదంలో “నరకా నరకాధిపతి యమధర్మరాజు. ఈయన జీవుల ఆయుః ప్రమాణాలను లెక్క గట్టి ఆయువు తీరగానే వారివారి ప్రాణాలను తీసుకెళ్లతాడు. ఇతనికి కాలుడు, సమవర్తి అనే పేర్లున్నాయి. ఇతను దయా దాక్షిణ్యాలు లేనివాడు. అవి ఉంటే విధిని నిర్వహించలేడు. కాని అంతటి నిర్దయుడైన యమధర్మరాజు మనసును కూడా కరిగించి తన వాక్చాతుర్యంతో దృఢసంకల్పంతో తన భర్త సత్యవంతుడి ప్రాణాలను తిరిగి తెచ్చుకుంది సావిత్రి. ఆ విధంగా భారతదేశంలోని స్త్రీలంతా కార్యదీక్ష, చెదరని సంకల్పబలం కలిగినవారని కీర్తిస్తాడు. “బ్రహ్మయంతటి” అన్నప్పుడు తనని గౌరవించని సృష్టి కర్త బ్రహ్మ దేవుడిని కూడా భూలోకంలో పూజాదికాలు లేకుండానే శపించిన భృగు మహర్షి వంటి మునులను భుజాలపై మోసినావు. తాకినంతనే సకల పాపాలను నశింప చేయగల గంగా గోదావరి కృష్ణ వంటి నదులు కలిగిన దానవు. భూమి పుట్టక ముందే నీవు ఉన్నావేమో సకల పురాణ శాస్త్రాలు చదివిన అగర్వ శ్రీమంతురాలివి అని కీర్తించడంలో భారతదేశం యొక్క సంతతి కార్యదీక్ష సంకల్పం కలిసిన వారిగా ప్రశంసించడమే గాక దేశ ప్రాచీనత కూడా కనిపిస్తుంది. మరో పద్యాన్ని చూదాం.

సీ.జలకంబులాడించు చెలికత్తెగద నీకు
*గనకాంబుజాఢ్య గంగాభవాని*
*తల మీదిగుండుమల్లెల దండగద నీకు?*
*సత్యస్ఫూర్తితోరుహిమాలయంబు*
*పూతబంగారు సొమ్ములు పెట్టెగద నీకు?*
*సిరివెలంది చరించుసింహాకంబు*
*ముద్దు గాతెదునిగ్గుటద్దంబుగద నీకు ?*
*నింబారు హిందూమహోంబురాశి*

తే.గీ. ఇట్టి నిను జూచి విప్పంబు బెట్టు మనుచ
నన్నిదిక్కులు యాచించుచున్న వమ్మ!
యైకమత్యంబు గల్గి నిన్ననుభవించు
కొఱత పూరింపవే మాకు భరతమాత!
(జాషువా సర్వ లభ్య రచనలు,పుట:539)

గంగా నది నీకు జలకాలాడించు చెలికత్తె, హిమాలయాలుగా నీతలలోని మల్లెపూలదండ అనంత సంపదల పేటిక సింహాళం హిందూ మణి సాగరం నీ సౌందర్యాన్ని ప్రతిబింబింపజేసే అద్దం. నిన్ను చూసి సమస్త దిక్కులు జ్ఞాన పెట్టమని యాచిస్తున్నాయి. అని వర్ణించడంలో భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని మన కళ్ళముందుంచడమే కాకుండా ప్రపంచదేశాలన్నింటికంటే ముందు భారతదేశం విజ్ఞానవంతమైనదిగా కవి కీర్తించాడు. ఈ ఖండికలోనిదే మణిపూస లాంటి మరో పద్యాన్నిచూద్దాం.

సీ. సగరమాంధాత్రాది షట్చ్రక్రవర్తుల
యంకసీమల నిల్చినట్టి సాధ్వి
కమలనాభునివేణుగానసుధాంబుధి
మునిగి తేలిన పరిపూతదేహ
కాళిదాసాదిసత్కవికుమారులగాంచి
కీర్తి నందిన పెద్ద గేస్తురాలు
బుద్ధదిమునిజనంబులతపంబున
మోదబాష్పము ల్విడిచిన భక్తురాలు

తే.గీ.సింధూగంగానదీ జలక్షీరమెపుడు
గురిసె బిడ్డల బోషించుకొనుచున్న
పచ్చి బాలింతరాలు మా భరతమాత
మాతలకు మాత : సకల సంపత్సమేత
(జాషువా సర్వలభ్య రచనలు, పుట:489)

ఈ భూతలంపై ఎందరెందరో మహాత్ములు అవతరించారు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించాడు. ఈ దశావతారాలలో ఒకటి శ్రీకృష్ణావతారం శ్రీకృష్ణుడు బోధించిన గీత భగవద్గీత ప్రధానమైనది. అధికమైన భావోద్వేగంతో కర్తవ్యం మరచిన అర్జునుడికి జగద్గురువైన శ్రీకృష్ణుడు చేసిన కర్తవ్యోపదేశమే భగవద్గీత. అది అందరికీ ఆచరణీయము. (హరిశ్చంద్రో నలో రాజ, పురుకుత్స: పురూరవా: /సగర: కార్త వీర్యశ్చ, షడేతే, చక్రవర్తిన)అంటే షట్ చక్రవర్తులు హరిశ్చంద్రుడు, నలుడు,పురుకుత్సుడు,పురూరవుడు,సగరుడు,కార్తవీర్యుడు మొదలైన షట్చ్రక్రవర్తులను కన్నదానవు అన్నప్పుడు హరిశ్చంద్రుడు సత్య నిష్ఠకు ప్రతీక. ఇచ్చిన మాటకు కట్టుబడి నిలిచిన మహారాజు. ఇంకా పురుడు మహారాజు తన తండ్రి కోసం తన యవ్వనాన్ని దానం చేసిన త్యాగశీలిగా ఈవిధంగా మనకు ఆదర్శప్రాయులైనవారు. జగత్ప్రసిద్ధులైన కాళిదాసు, వరాహమిహిరుడు, ఆర్యభట్ట మొదలైన కవులను పొంది ఎనలేని కీర్తి గడించినదానవు. శాంతి స్వభావులు, దయామూర్తులైన బుద్ధుడు, మొదలగు మునిపుంగవుల తపస్సు చేత సంతసించిన భక్తులు. గంగా, సింధూ, నదుల జీవ జలాలచేత తన. బిడ్డలను పోషించు కుంటున్న "పచ్చి బాలింతరాలు, మాతలకు మాత" అని కవి పేర్కొనడంలో ఆనాడు పోతన అమ్మ గురించి చెప్పిన పద్యాన్ని చూద్దాం

"అమ్మ లగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పె
ద్దమ్మ సురా రులమ్మ కడుపాఱడి పుచ్చినయమ్మ తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడియమ్మ దుర్గ మా
యమ్మకృపాబ్ధియిచ్చుత మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్"
(పోతన-ప్రథమ స్కంధం)

అని కీర్తించినట్లుగా భరతమాత ఆదిశక్తి రూపంగా కీర్తించినట్లుగా అనిపిస్తుంది. ఇదే కాకుండా గబ్బిలం ఖండికలో గబ్బిలానికి తన సందేశాన్ని వివరించిన తర్వాత దానికి కైలాసగిరికి చేరడానికి మార్గనిర్దేశం చేస్తూ దారిలో ఉన్న అతి పెద్ద గ్రంథాలయం తంజావూరులోని సరస్వతీ మహల్ అను సారంగధరుని చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన రాజమహేంద్రవరం కోటను, తిక్కన సోమయాజికి నెలవైన నెల్లూరును దర్శిస్తూ వెళ్ళమని అంటాడు.

ఈ విధంగా జాషువా భారత దేశము యొక్క ప్రాచీనతను ఆధ్యాత్మికతను విజ్ఞానం మొదలైన విషయాలను చాలా స్పష్టంగా వివరించా.డు వీటన్నిటి వలన ఈ కవికి భారతదేశం పట్ల జాతి పట్ల ఉన్న అపారమైన భక్తి గౌరవాలు ఉన్నాయని స్పష్టమౌతోంది. అందువలన విశ్వనరుడిగా కీర్తి పొందిన జాషువాగారిని ఒక కులానికో, లేదా వర్గానికో పరిమితం చేయడం సరికాదని, ఈయనలోని దేశభక్తి కోణాన్ని కూడా గుర్తించాల్సిన అవసరాన్ని తెలియ చేయడమే ఈ వ్యాస లక్ష్యం.

**డా.ఎం.మంజుశ్రీ,**

**అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,**

**తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి,**

**తెలంగాణ**